సాక్షి అనకాపల్లి
సోమవారం ¡ 26 ¡ ఫిబ్రవరి ¡ 2024



ఉపమాక వెంకన్న పెళ్లి రాట


ఉపమాక వెంకన్న ఆలయంలో వచ్చే నెల 20న ప్రారంభమయ్యే తిరుకల్యాణోత్సవాలకు పెళ్లిరాట వేశారు. 8లో



టీడీపీ, జనసేన 'సోషల్' వార్

సోషల్ మీడియా వేదికగా రెండు ప్రతిపక్ష పార్టీల మధ్య మాటల యుద్ధం సాగుతోంది. మిత్రభేదానికి ప్రతీకగా నిలుస్తోంది. 8లో

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు



విశాఖ సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర, జగన్నాథుడు విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు.

న్యూస్‌రీల్

నర్సీపట్నం స్టేషన్ అభివృద్ధిని రాజ్యసభలో ప్రస్తావిస్తా...

ఎంపీ గొల్ల బాబూరావు



బాబూరావును ఆహ్వానిస్తున్న అధికారులు

ఎస్.రాయవరం: నర్సీపట్నం రోడ్డు రైల్వేస్టేషన్‌ను అభివృద్ధి చేసి ఇక్కడ జన్మభూమి సూపర్‌ఫాస్ట్ రైలుతోపాటు మరిన్ని ఎక్స్‌ప్రెస్‌లు నిలిపేలా చేయాలని విజయవాడ డీఆర్‌ఎంను రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు కోరారు. నియోజకవర్గ పరిధిలో రైల్వే క్రాసింగ్‌ల వద్ద అండర్ పాస్ బ్రిడ్జిల ప్రారంభోత్సవానికి ఆహ్వానం పలుకుతూ ఆదివారం కొరుప్రోలు క్యాంపు కార్యాలయానికి రైల్వే అధికారులు వచ్చారు. ఈ సందర్భంగా గొల్ల బాబూరావు నర్సీపట్నం రైల్వేస్టేషన్‌లో రిజర్వేషన్ కౌంటర్ ఎందుకు తొలగించారని ప్రశ్నించారు. డీఆర్‌ఎం పరిధిలో నిర్ణయాలు ఉంటాయని చెప్పడంతో వెంటనే డీఆర్‌ఎం నంబర్ తీసుకుని ఫోన్ చేసి వివరించారు. తాను తొలుత రాజ్యసభలో ఈ సమస్యను ప్రస్తావిస్తానని, వెంటనే నర్సీపట్నం రోడ్డు రైల్వేస్టేషన్ అభివృద్ధికి శ్రీకారం చుట్టాలని కోరారు. డీఆర్‌ఎం సానుకూలంగా స్పందిస్తూ పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. ఎమ్మెల్యేకు ఆహ్వానం అందించిన వారిలో రైల్వే అధికారులు బ్రహ్మాజీరావు, రాఘవేంద్రరావు, అనిల్‌కుమార్ ఉన్నారు.

అప్పన్న సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి జ్యోతిర్మయి



సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని ఆదివారం రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జ్యోతిర్మయి దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆమె పేరిట అర్చకులు అంతరాలయంలో అష్టోత్తరంపూజ నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. గోదాదేవి సన్నిధిలో హారతి అందజేశారు. స్వామి ప్రసాదం, శేషవస్త్రాన్ని ఏఈవో పాలూరి నరసింగరావు అందజేశారు.

ఆర్టీసీకి మాఘపౌర్ణమి ఆదాయం రూ.13.46 లక్షలు

అనకాపల్లి: జిల్లాలో మాఘపౌర్ణమిని పురస్కరించుకుని ప్రజారవాణాశాఖ (ఆర్టీసీ)కి రూ.13 లక్షల 46 వేల ఆదాయం వచ్చినట్లు ఆ శాఖ జిల్లా అధికారి కె.పద్మావతి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అనకాపల్లి, నర్సీపట్నం డిపోల నుంచి పూడిమడక, రేవుపోలవరం తీరంలో భక్తుల సముద్ర స్నానాలకు 70 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామని, ఆ సర్వీసుల ద్వారా ఈ ఆదాయం వచ్చినట్లు ఆమె తెలిపారు.

రేపు యలమంచిలిలో హాకీ ఎంపికలు

యలమంచిలి: రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు ఈనెల 27న సీనియర్ బాలికల విభాగంలో ఎంపికలు జరగనున్నట్లు జిల్లా హాకీ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కొంతారు నరేష్ ఆదివారం సాయంత్రం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిగ్రీ కళాశాల మైదానంలో రాష్ట్రస్థాయిలో వచ్చే నెల 8న జరిగే అంతర్ జిల్లాల సీనియర్ బాలికల హాకీ పోటీలకు జిల్లా జట్టును ఎంపిక చేస్తామన్నారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు 1995వ సంవత్సరం తర్వాత పుట్టినవారు అర్హులని, సంబంధిత అర్హత పత్రాలతో 27వ తేదీ మధ్యాహ్నం డిగ్రీ కళాశాల మైదానానికి రావాలని తెలిపారు.

అమృత భాగ్యం... ఆధునిక యోగం

- రూ.13.13 కోట్లతో యలమంచిలి రైల్వే స్టేషన్‌కు కొత్త రూపు
- అభివృద్ధి పనులకు వర్చువల్‌గా ప్రధాని మోదీ శంకుస్థాపన నేడు
- అనకాపల్లి–తుని స్టేషన్ల మధ్య 8 భూగర్భ రైలు వంతెనల ప్రారంభం

అభివృద్ధి పనులు ఇలా...

- రూ.3.91 కోట్లతో ప్లాట్‌ఫారం అభివృద్ధి
- రూ.1.89 కోట్లతో వెయిటింగ్ హాల్, టాయిలెట్లు
- రూ.3.20 కోట్లతో అదనపు షెల్టర్లు
- రూ.1.76 కోట్లతో సర్క్యులేటింగ్ ఏరియా అభివృద్ధి



పెద బోదిగల్లం వద్ద నిర్మించిన రైల్వే అండర్ బ్రిడ్జి



యలమంచిలి రైల్వే స్టేషన్

అచ్యుతాపురం/యలమంచిలి రూరల్: దేశంలో రైల్వేస్టేషన్ల ఆధునికీకరణలో భాగంగా యలమంచిలి రైల్వేస్టేషన్‌లో అత్యాధునిక వసతులు కల్పించనున్నారు. అమృత్ భారత్ పథకానికి ఎంపికైన యలమంచిలి స్టేషన్‌లో రూ.13.13 కోట్లతో వసతుల కల్పనకు ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేయనున్నారు. జిల్లాలో అనకాపల్లి, యలమంచిలి రైల్వే స్టేషన్లను అమృత్ స్టేషన్లుగా గుర్తించిన విషయం తెలిసిందే. ఇప్పటికే అనకాపల్లి స్టేషన్‌లో పునర్నిర్మాణ పనులు చకచకా జరుగుతున్నాయి. ప్రస్తుతం యలమంచిలి రైల్వే స్టేషన్‌లో కూడా ప్రయాణికులకు అవసరమైన అత్యాధునిక వసతుల కల్పనకు రైల్వే శాఖ ఉన్నతాధికారులు కార్యాచరణ రూపొందించారు. దీనిలో భాగంగా ప్లాట్‌ఫారంల ఎత్తు పెంచడం, వాటి ఉపరితల అభివృద్ధి (టైల్స్ వేయడం), స్టేషన్ ముఖభాగం సర్క్యులేటింగ్ ఏరియా విస్తరణ, ఆధునికీకరణ, ప్రయాణికులు వేచి ఉండేందుకు వెయిటింగ్ హాల్, ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణంతోపాటు రెండు లిఫ్టుల ఏర్పాటు, విద్యుదీకరణ ఆధునికీకరించడం, ఆకర్షణీయమైన సూచిక బోర్డులు, విశాలమైన పార్కింగ్, పచ్చదనం, ఆకర్షణతో కూడిన భవనాల నిర్మాణం చేపడతారు. ఈ పనులకు సోమవారం ఉదయం 10.40 గంటలకు ప్రధాని మోదీ వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేస్తారని రైల్వే అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి ఎంపీ డాక్టర్ బి.వి.సత్యవతి, స్థానిక ఎమ్మెల్యే కన్నబాబురాజు, యలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి, పలువురు స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొననున్నట్టు అధికారవర్గాలు తెలిపాయి. వీటితోపాటు జిల్లాలో అనకాపల్లి–తుని రైల్వే స్టేషన్ల మధ్య పూర్తయిన 8 ఆర్‌యూబీ (భూగర్భ రైలు వంతెన)లను కూడా మోదీ ప్రారంభిస్తారు. యలమంచిలి మండలంలో ములకలాపల్లి రైల్వే గేటు వద్ద రూ రూ.5.84 కోట్లు, తురంగలపాలెం రైల్వే లెవెల్ క్రాసింగ్ వద్ద రూ.6.57 కోట్లతో నిర్మించిన ఆర్‌యూబీలు సోమవారం నుంచి వినియోగంలోకి రానుండడంతో ఈ మార్గం మీదుగా రాకపోకలు సాగించే పరిసర గ్రామాల ప్రజలకు రైల్వే గేట్ల వద్ద గంటల తరబడి నిరీక్షించే ఇక్కట్లు తప్పినట్లే.

స్టేషన్‌కు మరింత ప్రాధాన్యం



ములకలాపల్లిలో నిర్మించిన ఆర్‌యూబీ

యలమంచిలి రైల్వే స్టేషన్‌కు ప్రాధాన్యత పెరిగింది. అనకాపల్లి తర్వాత ఈ స్టేషన్ ప్రయాణికులపరంగా, భవిష్యత్‌లో రవాణాపరంగా కీలకమని గుర్తించారు. రాంబిల్లి వద్ద నేవల్‌బేస్ నిర్మాణం, అచ్యుతాపురం సెజ్‌లోని కంపెనీల వల్ల యలమంచిలి స్టేషన్‌కు ప్రాముఖ్యత ఏర్పడింది. ఇక్కడ మౌలిక వసతులు మెరుగుపరచాలని ఎంపీ సత్యవతి పార్లమెంటులో ప్రస్తావించడంతో పాటు, రైల్వే శాఖ అధికారులకు నివేదించారు. యలమంచిలి స్టేషన్ నుంచి ఇటు విశాఖకు, అటు తుని, రాజమండ్రి తదితర ప్రాంతాలకు ఎంఎస్‌టీ ప్రయాణికుల సంఖ్య రోజురోజుకి పెరుగుతోంది. మొత్తం ఈ రైల్వేస్టేషన్ మీదుగా రోజుకు మొత్తం 140 రైళ్లు వెళ్తుండగా, వీటిలో 30 రైళ్లకు హాల్ట్ ఉంది. ప్రయాణికులకు క్యాంటీన్, వీఐపీలకు లాంజ్ వంటి వసతులు అవసరమని గుర్తించారు. ఈ పనులు పూర్తయితే ప్రయాణికులకు మెరుగైన సదుపాయాలు లభిస్తాయని యలమంచిలి రైల్వే స్టేషన్ మాస్టర్ సురేశ్ కుమార్ చెప్పారు.

శ్రమ ఫలించింది

యలమంచిలి రైల్వే స్టేషన్‌కు ప్రాధాన్యత పెరుగుతోంది. అచ్యుతాపురం సెజ్, నేవల్ బేస్ కార్యకలాపాలకు సంబంధించి రాకపోకల విషయంలో అనకాపల్లికి ప్రత్యామ్నాయంగా యలమంచిలి రైల్వే స్టేషన్‌ను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది. ఈ విషయం పార్లమెంటులో ప్రస్తావించాను. రైల్వే ఉన్నతాధికారులను రాతపూర్వకంగా కోరాను. ఎట్టకేలకు పనులకు శంకుస్థాపన జరగనుంది. 8 ఆర్‌యూబీలను ప్రారంభించనున్నారు.

–డాక్టర్ సత్యవతి, ఎంపీ

8 ఆర్‌యూబీలకు ప్రారంభోత్సవం

యలమంచిలి రైల్వే స్టేషన్‌లో మౌలిక సదుపాయాల మెరుగుదలతోపాటు, పాయకరావుపేట, యలమంచిలి నియోజక వర్గాల పరిధిలో నిర్మాణం పూర్తి చేసుకున్న 8 ఆర్‌యూబీలను ప్రారంభించనున్నారు. పి.లక్ష్మీపురం, నామవరం, సీతంపాలెం, పెద్దబోదిగల్లు, ఏటికొప్పాక గేటు, ములకలపల్లి, తురంగలపాలెం వద్ద నిర్మించిన రైల్ అండర్ బ్రిడ్జిలను పీఎం మోదీ వర్చువల్ విధానంలో ప్రారంభించనున్నారు.

సజావుగా గ్రూప్–2 ప్రిలిమ్స్

82.25 శాతంమంది అభ్యర్థుల హాజరు



మాకవరపాలెం కేంద్రం వద్ద డీఎస్పీలకు సూచనలు ఇస్తున్న ఎస్పీ మురళీకృష్ణ

తుమ్మపాల/అనకాపల్లి/మాకవరపాలెం/చోడవరం రూరల్: జిల్లాలో ఏపీపీఎస్సీ నిర్వహించిన గ్రూప్–2 ప్రిలిమ్స్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. మొత్తం 10,627మంది దరఖాస్తు చేయగా 9,060 మంది పరీక్షలకు హాజరైనట్లు కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి తెలిపారు. 82.25 హాజరు శాతం నమోదైందని తెలిపారు. శ్రీచైతన్య స్కూల్లో పరీక్ష కేంద్రాన్ని ఆయన సందర్శించారు. అనకాపల్లి పట్టణ పరిధిలో 8 సెంటర్లలో అభ్యర్థులు పరీక్షలు రాశారు. మాకవరపాలెం అవంతి ఇంజనీరింగ్ కళాశాల కేంద్రంలో 1140 మంది హాజరయ్యారు. ఈ కేంద్రాన్ని ఎస్పీ కె.వి.మురళీకృష్ణ పరిశీలించారు. చోడవరంలో వివిధ విద్యాసంస్థల్లో నిర్వహించిన గ్రూప్–2 పరీక్షను 2,182మంది రాశారు. ఆర్డీవో చిన్నికృష్ణ, డీఎస్పీ వి.సుబ్బరాజు, నర్సీపట్నం డీఎస్పీ వెంకటరామయ్య, జిల్లా పోలీసు ట్రైనింగ్ సెంటర్ డీఎస్పీ రవివర్మ, అనకాపల్లి డీఎస్పీ సుబ్బరాజు, దిశ పోలీస్ డీఎస్పీ ఉపేంద్రరావు, సీఐ శ్రీనివాసరావు తమ సిబ్బందితో పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.



చోడవరంలో అభ్యర్థిని తనిఖీ చేస్తున్న కానిస్టేబుల్

సమరభేరి మోగిద్దాం.. సైనికుల్లా పనిచేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు వరుదు కల్యాణి

- జగనన్న గెలుపులో మహిళలే కీలక పాత్ర పోషించాలి
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు వరుదు కల్యాణి పిలుపు

దేవరాపల్లి: మహిళలకు అన్ని రంగాల్లో సముచిత స్థానం కల్పించిన జగనన్నను మరోమారు ముఖ్యమంత్రిగా గెలిపించేందుకు సైనికుల్లా పనిచేద్దామని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి పిలుపునిచ్చారు. దేవరాపల్లి మండలం తారువలో వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు ఈర్లె అనురాధ అధ్యక్షతన జిల్లా మహిళా విభాగం కార్యవర్గ ఆత్మీయ సమావేశం ఆదివారం జరిగింది. ముందుగా దివంగత సీఎం డా. వై.ఎస్.రాజశేఖరరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ముఖ్యఅతిథిగా హాజరైన వరుదు కల్యాణి మాట్లాడుతూ సీఎం జగన్ అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందించి ఎన్నికల్లో ప్రజలను ధైర్యంగా ఓటు అడిగే హక్కును మనకు కల్పించారన్నారు. ఆయనకు ప్రతి మహిళ అండగా నిలవాలన్నారు. మహిళల పేరుతో సంక్షేమానికి పెద్దపీట వేసిన జగనన్న ప్రభుత్వాన్ని తిరిగి అధికారంలోకి తీసుకొచ్చేందుకు రెండు నెలలు కష్టపడి పనిచేయాలన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ మాట్లాడుతూ.. మా పాలనలో మీ కుటుంబానికి మేలు జరిగితేనే ఓటు వేయండని ధైర్యంగా చెప్పిన ఏకైక నాయకుడిగా జగన్‌మోహన్‌రెడ్డి దేశ చరిత్రలో నిలిచిపోతారన్నారు. జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు ఈర్లె అనురాధ మాట్లాడుతూ మహిళా సాధికారతను అందించిన ఘనత సీఎం జగన్‌కే దక్కిందన్నారు. జిల్లాలోని ఒక పార్లమెంట్, ఏడు అసెంబ్లీ స్థానాల్లో అభ్యర్థులను గెలిపించి జగనన్నకు కానుకగా అందిద్దామన్నారు. పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు పెడాడ రమణికుమారి, మాధవి వర్మ, రీజనల్ ఇన్‌చార్జ్ పీలా వెంకటలక్ష్మి, రాష్ట్ర మహిళా కమిటీ జనరల్ సెక్రటరీలు శ్రీదేవి, రాజేశ్వరి, మహిళా విభాగం ఎస్టీ సెల్ అధ్యక్షురాలు సుజాత, దేవరాపల్లి వైస్ ఎంపీపీ చింతల బుల్లి లక్ష్మి, జెడ్పీటీసీలు లాలం శారద, కర్రి సత్యం, కె.కోటపాడు ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్, దేవరాపల్లి, మాడుగుల మండలాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు బూరె బాబురావు, వేమవరపు రామధర్మజ పాల్గొన్నారు.

పొత్తు.. పార్టీ చిత్తుకేనా?



మాజీ ఎమ్మెల్యే పీలాకు టికెట్ ఇవ్వనందుకు కశింకోటలో నిరసన తెలుపుతున్న టీడీపీ శ్రేణులు

- ఇదేమి నిర్ణయం.. తెలుగు తమ్ముళ్ల నిరసన గళం
- జనసేనకు అనకాపల్లి టికెట్ కేటాయింపుపై గరంగరం
- అధిష్టానం పునరాలోచించాలని డిమాండ్

అనకాపల్లి (యలమంచిలి రూరల్)/కశింకోట/అనకాపల్లి: టీడీపీ–జనసేన పార్టీల తొలి విడత అసెంబ్లీ అభ్యర్థుల జాబితా అనకాపల్లి నియోజకవర్గ తెలుగు తమ్ముళ్లలో తీవ్ర అసంతృప్తి రగిల్చింది. పదేళ్లుగా నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కృషి చేసిన మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణను కాదని జనసేనకు టికెట్ కేటాయించడం గందరగోళానికి దారితీసింది. ఇప్పటి వరకూ చంద్రబాబే తమకు ఇంద్రుడు, చంద్రుడు అని మాట్లాడినవారు ఇప్పుడు ఏకంగా పార్టీ అధినేత వైఖరినే తప్పుబడుతున్నారు. జిల్లా కేంద్రమైన అనకాపల్లిలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణకు పార్టీ టికెట్ వస్తుందని ఆయన అనుచరగణం, టీడీపీ శ్రేణులు భావించాయి. కాని అనూహ్యంగా ఈ సీటును పొత్తుల్లో భాగంగా జనసేనకు కేటాయించడంతో ఆదివారం కశింకోట, అనకాపల్లి పట్టణాలలో తెలుగు తమ్ముళ్ల నిరసనలు పెల్లుబికాయి. చంద్రబాబు తీరుపై ఆ పార్టీ నేతలే తీవ్రస్థాయిలో దుమ్మెత్తిపోస్తున్నారు. నెల రోజుల కిందట జనసేనలో చేరిన మాజీ మంత్రి కొణతాలను ఉమ్మడి అభ్యర్థిగా బరిలో నిలపడం సరికాదంటున్నారు. ఈ మేరకు ఆదివారం కశింకోట మండల టీడీపీ నాయకులు సమావేశమయ్యారు. తామంతా పీలా వెంటే ఉంటామని, ఆయనకు టికెట్ ఇవ్వకపోతే రాజీనామా చేస్తామని అధినేతకు హెచ్చరికలు పంపారు. అనకాపల్లిలో కూడా టీడీపీ నేతలు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఇలాంటి పొత్తుల వల్ల పార్టీకి నష్టమే తప్ప ప్రయోజనం ఉండదని, పార్టీకి అనుకూలంగా వున్న సీటును జనసేనకు ఇవ్వడమేంటని ప్రశ్నిస్తున్నారు. నమ్మకాన్ని వమ్ము చేయడమే చంద్రబాబు నైజమని సొంత పార్టీ నేతలే విమర్శిస్తూ మీడియా సమావేశాలు నిర్వహించడం, సామాజిక మాధ్యమాల్లో వీడియోలను పోస్టు చేయడం టీడీపీ శ్రేణుల్లో తీవ్ర నైరాశ్యాన్ని తెచ్చింది. చంద్రబాబుకు మాటపై నిలబడే తత్వం లేదని, ఆయన మాటలకు, చేతలకు పొంతన లేదని నియోజకవర్గ టీడీపీ ముఖ్యనాయకులు బాహాటంగానే విమర్శలు చేస్తున్నారు.

మూకుమ్మడి రాజీనామాలకు సిద్ధం

మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణకు టీడీపీ టికెట్ ఇవ్వకుంటే మూకుమ్మడిగా రాజీనామా చేయడానికి సిద్ధంగా ఉన్నామని కశింకోట మండల టీడీపీ శ్రేణులు హెచ్చరించారు. ఆదివారం సాయంత్రం కశింకోటలోని గౌరమ్మ ఆలయం వద్ద నల్ల బ్యాడ్జీలతో తీవ్ర నిరసన తెలిపారు. అనకాపల్లి పార్లమెంటు తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి ఉగ్గిన రమణమూర్తి మాట్లాడుతూ గత ఐదేళ్లుగా కష్టపడి నియోజక వర్గంలో కార్యకర్తలను నిరంతరం ఉత్తేజపరిచి పార్టీని నిలబెట్టుకుంటూ పటిష్టవంతం చేసిన పీలా వంటి వ్యక్తికి సీటు ఇవ్వకుండా తీవ్ర అన్యాయం చేశారని విమర్శించారు.



అనకాపల్లిలో మాట్లాడుతున్న టీడీపీ సీనియర్ నాయకుడు బొద్దపు ప్రసాద్

పార్టీ శ్రేణులకు తెలియకుండా జనసేనకు టికెట్ కేటాయించడం శోచనీయమన్నారు. అధిష్టానం పునరాలోచించాలని కోరారు. పొత్తులో భాగంగా అనకాపల్లి ఎంపీ సీటు జనసేనకు కేటాయిస్తే పని చేస్తామన్నారు. అయితే ఎమ్మెల్యే సీటు మాత్రం పీలాకు ఇవ్వాలన్నారు. పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పెంటకోట రాము, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు వేగి గోపీకృష్ణ, డీసీసీబీ డైరెక్టర్ సిదిరెడ్డి శ్రీనివాసరావు, కొత్తపల్లి మాజీ సర్పంచ్ బుదిరెడ్డి గంగయ్య పాల్గొన్నారు.

గెలవలేని పార్టీతో మనకెందుకు పొత్తు ?

గెలవలేని జనసేన పార్టీతో టీడీపీకి పొత్తు ఎందుకని, అన్ని స్థానాలకు టీడీపీ అభ్యర్థులను నిలబెట్టాలని టీడీపీ సీనియర్ నాయకుడు బొద్దపు ప్రసాద్ డిమాండ్ చేశారు. అనకాపల్లి గవరపాలెంలోని పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ శ్రేణులు నల్లబ్యాడ్జీలతో ఆదివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పొత్తు కారణంగా టీడీపీ ఇంటికి వెళ్లిపోవడం ఖాయమని, అధిష్టానం పునరాలోచించాలని కోరారు.

ఇలాంటి నిర్ణయాల వల్ల వైఎస్సార్‌సీపీకి విజయావకాశాలు పెరుగుతాయన్నారు. పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ఉన్నామని, చంద్రబాబు, లోకేష్‌లు అనకాపల్లి వచ్చినప్పుడు పార్టీ కోసం లక్షలాది రూపాయలు ఖర్చు చేశామని పేర్కొన్నారు. ఇటీవల మునగపాక మండలం నాగులాపల్లిలో జరిగిన శంఖారావం సభలో అనకాపల్లి టికెట్ పీలాకే ఇస్తామని లోకేష్ పార్టీ శ్రేణులకు చెప్పిన విషయం గుర్తు చేశారు. తొలి నుంచి జనసేన నిర్మాణంలో పాల్గొన్న పరుచూరి భాస్కరరావుకు కాకుండా ఇటీవల పార్టీలో చేరిన కొణతాలకు టికెట్ ప్రకటించడం హాస్యాస్పదమన్నారు. పార్టీ నేతలు మళ్ల సురేంద్ర, కాయల ప్రసన్నలక్ష్మి, అధికసంఖ్యలో పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.



అడ్డురోడ్డులో సిద్ధం బహిరంగ సభ కోసం ఏర్పాటు చేస్తున్న వేదిక

సర్వం 'సిద్ధం'

- నేడు అడ్డురోడ్డులో వైఎస్సార్‌సీపీ బహిరంగ సభ
- ముఖ్యఅతిథిగా పార్టీ ఉత్తరాంధ్ర సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డి



సభ ఏర్పాట్లు పరిశీలిస్తున్న నాయకులు

నక్కపల్లి/ఎస్.రాయవరం: పాయకరావుపేట నియోజకవర్గస్థాయిలో అడ్డురోడ్డులో సోమవారం వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న బహిరంగ సభకు సర్వం సిద్ధమయింది. పార్టీ శ్రేణుల్లో జోష్ నింపేందుకు, మరో రెండు నెలల్లో జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు సమాయత్తం చేసేందుకు నిర్వహిస్తున్న ఈ బహిరంగ సభకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. జాతీయ రహదారికి సమీపంలో అడ్డురోడ్డు జంక్షన్లో ఈ బహిరంగ సభ జరగనుంది. పార్టీ ఉత్తరాంధ్ర రీజనల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, డిప్యూటీ కోఆర్డినేటర్ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికైన స్థానిక ఎమ్మెల్యే గొల్ల బాబూరావు, అనకాపల్లి ఎంపీ డాక్టర్ సత్యవతి, నియోజకవర్గ సమన్వయకర్త, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు, పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్‌లు ముఖ్యఅతిథులుగా హాజరు కానున్నారు. గత నెలలో భీమిలిలో సీఎం వైఎస్ జగన్ నిర్వహించిన ఉత్తరాంధ్ర సిద్ధం బహిరంగ సభ సూపర్‌సక్సెస్ కావడంతో నియోజకవర్గ స్థాయిలో కూడా బహిరంగ సభలు నిర్వహించాలని పార్టీ అధిష్టానం ఆదేశించిన నేపథ్యంలో సోమవారం సాయంత్రం ఈ బహిరంగ సభను ఏర్పాటు చేశారు. భారీ సంఖ్యలో పార్టీ శ్రేణులు హాజరుకానున్న ఈ సభను ఎమ్మెల్యే, సమన్వయకర్తలతోపాటు, నాలుగు మండలాలకు చెందిన సీనియర్ నాయకులు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత పాయకరావుపేట నియోజకవర్గంలో డీబీటీ, నాన్ డీబీటీ పథకాల కింద సుమారు రూ.3 వేల కోట్ల విలువైన సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు అందాయి. నక్కపల్లిలో డిగ్రీ కళాశాల ఏర్పాటు, రూ.3 కోట్లతో 50 పడకల స్థాయికి నక్కపల్లి ఆస్పత్రి అప్‌గ్రేడ్, కోటవురట్ల ఏరియా ఆస్పత్రిలో రూ.3 కోట్లతో అదనపు భవనాల నిర్మాణం, పాయకరావుపేట, ఎస్.రాయవరంలో పీహెచ్‌సీ భవనాల నిర్మాణం, రూ.62 కోట్లతో పలు గ్రామాలకు రోడ్డు సదుపాయం, రూ.200 కోట్లతో ఇంటింటికీ కుళాయి ప్రగతికి ప్రతీకలుగా నిలిచిపోతాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజలకు చేసిన మేలును వివరిస్తూ.. ఈ బహిరంగ సభ ద్వారా ఎన్నికల శంఖారావం పూరించనున్నారు. ప్రతిపక్షాల పొత్తు రాజకీయం, 2014 ఎన్నికల్లో వంగలపూడి అనిత ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మోసగించిన విధానాన్ని ఈ సభ ద్వారా ప్రజలకు వివరించనున్నారు.

ఎస్సీ వర్గీకరణతోనే సమ న్యాయం

ఎమ్మార్పీఎస్ అధినేత మంద కృష్ణమాదిగ

తుమ్మపాల: ఎస్సీ వర్గీకరణ జరిగితేనే 59 ఉప కులాల వారికి సమన్యాయం జరుగుతుందని, అందుకే 30 ఏళ్లుగా ఉద్యమ పోరాటం చేస్తున్నామని ఎమ్మార్పీఎస్ అధినేత మంద కృష్ణమాదిగ అన్నారు. పట్టణంలో రోటరీ కల్యాణ మండపంలో ఆదివారం సాయంత్రం ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు ఎలక మల్లిబాబు ఆధ్వర్యంలో జరిగిన విస్తృత స్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నవంబర్‌లో జరిగిన ఎమ్మార్పీఎస్ జాతీయ సమావేశంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన హామీ మేరకు ఎస్సీల వర్గీకరణ జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గతంలో ఎస్సీ వర్గీకరణ చేసినప్పుడు మాదిగ ఉపకులాల వారు 25 వేల ఉద్యోగాలు పొందారని, కొందరు కోర్టుకు వెళ్లి ఏబీసీడీ వర్గీకరణను నిలిపివేయించి వంద ఏళ్ల వెనక్కు నెట్టివేశారని బాధను వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టులో ఏడుగురు న్యాయమూర్తుల ధర్మాసనం వాదోపవాదాల అనంతరం తీర్పు రిజర్వ్ చేసిందని, మనకు అనుకూలంగా రావాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కాకినాడ కనకేశ్వరరావు, జిల్లా అధికార ప్రతినిధి కొల్లి చిన్న అప్పారావు, ఎంఎస్‌పీ వర్కింగ్ ప్రెసిడెంట్ కట్టుమూరి మంగరాజు, జిల్లా అధ్యక్షుడు, ఉత్తర కోస్తా జిల్లాల ఇన్‌చార్జ్ ముమ్మిడివరపు చిన్న సుబ్బారావు, గొలుగొండ ఎంపీపీ గజ్జల మణికుమారి పాల్గొన్నారు



సమావేశంలో మాట్లాడుతున్న మంద కృష్ణమాదిగ

క్లుప్తంగా

వైశ్యరాజు జ్యూయలర్స్ నూతన షోరూం ప్రారంభం



వైశ్యరాజు జ్యూయలర్స్ నూతన షోరూంను ప్రారంభిస్తున్న గుంపిన రమేష్

అనకాపల్లి : స్థానిక మెయిన్‌రోడ్డులో వైశ్యరాజు జ్యూయలర్స్ నూతన షోరూమ్‌ను వ్యాపారవేత్త గుంపిన రమేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో బంగారానికి ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు. సిల్వర్ ఆర్టికల్స్ కొనుగోలుపై కిలోకు రూ.10 వేల తగ్గింపు ఉందన్నారు. ఈ ఆఫర్ 9 గ్రాములకుపైబడిన బంగారు ఆభరణాల కొనుగోలుకు వర్తిస్తుందన్నారు. చక్కటి డిజైన్లు ఇక్కడ లభిస్తాయని తెలిపారు. అంతకు ముందు వ్యాపారవేత్తలు కొణతాల రాజేంద్ర, వి.ఎస్. నూకరాజు, కోరుకొండ బుచ్చిరాజు జ్యోతి ప్రజ్వలన చేశారు. మొదటి కొనుగోలు ఎంవీపీ బిల్డర్స్ అండ్ ఎస్టేట్స్ జామి భోజరాజు చేశారు. ఈ కార్యక్రమంలో వైశ్యరాజు జ్యూయలర్స్ చెర్మన్ వైశ్యరాజు ఫల్గుణరాజు, డైరెక్టర్ వైశ్యరాజు నరేష్, వైశ్యరాజు భద్రగిరిరాజు, వైశ్యరాజు కిరణ్‌కుమార్ రాజు, కొనుగోలుదారులు పాల్గొన్నారు.

సరుగుడు, తాండవలో సందర్శకుల సందడి



జలపాతం వద్ద సందర్శకుల జలకాలాట

నాతవరం: మండలంలో సరుగుడు జలపాతంతోపాటు తాండవ రిజర్వాయరుపై ఆదివారం సందర్శకులు సందడి చేశారు. సరుగుడు జలపాతం వద్ద ఎత్తయిన రెండు కొండల మధ్యలోంచి జాలవారే నీటిలో జలకాలాట ఆడేందుకు పోటీ పడ్డారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారంతా ఉదయం నుంచి సాయంత్రం ఆటపాటలతో కాలక్షేపం చేశారు. తాండవ ప్రాజెక్టు దిగువన నల్లకొండమ్మ ఆలయ ప్రాంగణంలో, తాండవ రిజర్వాయరుపై సందర్శకులు కోలాహలం నెలకొంది.

టీడీపీ Vs జనసేన సోషల్ వార్

సోషల్ మీడియా వేదికగా మాటల యుద్ధం











తొలి జాబితాతోనే యుద్ధం మొదలైంది.. ఈ యుద్ధం ఎన్నికల క్షేత్రంలో కాదు.. సామాజిక మాధ్యమాల్లో. వైరి శ్రేణుల మధ్య కాదు.. పొత్తు కౌగిల్లో ఉన్న పార్టీల మధ్య. పొత్తుల మాటున చంద్రబాబుకు అలవాటైన వెన్నుపోటుతో జనసేన నాయకులు, కార్యకర్తలు విలవిల్లాడుతున్నారు. మా నాయకుడ్ని సీఎం కుర్చీపై చూస్తామని అనుకుంటే.. ముష్టి విదిలించినట్లు 24 సీట్లు ఇవ్వడంపై జనసేన కార్యకర్తలు జీర్ణించుకోలేక.. ఈ కూలి బతుకులు మాకొద్దంటూ.. పవన్‌కు గ్లాసుకూ ఒక దండం పెట్టేస్తున్నారు. మీ తొత్తు పార్టీకి 24 సీట్లే ఎక్కువ మూసుకొని బానిసల్లా ఉండడమేనంటూ టీడీపీ కార్యకర్తలు కవ్వింపు మాటలతో రెచ్చగొడుతున్నారు. పావలా వంతు కూడా సీట్లు దక్కించుకోలేని జనసేన, పొత్తు పేరుతో బానిస పార్టీలాగానే జనసేనని చూస్తున్న టీడీపీ కార్యకర్తల మధ్య 'సోషల్' యుద్ధం జరుగుతోంది.

- బానిసలకు 24 ఎక్కువంటూ టీడీపీ శ్రేణుల కవ్వింపు మాటలు
- వెన్నుపోటు పొడుస్తున్నారంటూ జనసేన కార్యకర్తల ఆరోపణలు
- ఇక రెండు జెండాలు మోయలేమంటున్న జనసేన కార్యకర్తలు
- పవన్ కల్యాణ్ వైఖరికోదండం అంటూ పార్టీకి స్వస్తి
- వచ్చే ఎన్నికల్లో వైఎస్ జగనే సీఎం అని బహిరంగంగా వెల్లడి

సాక్షి, విశాఖపట్నం : 'అన్నా.. ఇన్నాళ్లూ.. నీ మీద నమ్మకంతో జెండా పట్టి కూలీలా పనిచేశాం. రెండు జెండాలు పట్టుకొని తిరుగుదామని పిలుపునిస్తే.. తిరిగాం.. ఇంక మా వల్ల కాదు.. నీ కోసం క్షేత్ర స్థాయిలో మేం రొమ్ము విరుచుకొని పనిచేస్తుంటే.. నువ్వు చంద్రబాబు ఎదుట సాగిలాపడుతూ బాంచన్ దొర అన్నట్లుగా తలూపుతుంటే ఇంకా చూస్తూ తట్టుకోవడం మా వల్ల కావడం లేదు.. ఇక సెలవు అన్నా.. పవన్ అంటే ప్రాణం.. కానీ.. ఓటు మాత్రం వైఎస్ జగన్‌కే వేస్తాం..' అని ఒకరు.

'నీ మీద నమ్మకం పోయిందన్నా.. నీ వెంట నడిచే ఓపిక లేదు.. నడిచే ప్రసక్తే లేదు..' అంటూ మరొక జనసేన కార్యకర్త పవన్‌ని సోషల్ మీడియా వేదికగా తూర్పారబడుతున్నారు.

టీడీపీ, జనసేన సంయుక్తంగా విడుదల చేసిన తొలి జాబితా.. ఆయా పార్టీ శ్రేణుల్లో చిచ్చు రేపుతోంది. టీడీపీ, జనసేన శ్రేణులు ఒకరిపై ఒకరు సోషల్ మీడియాలో కత్తులు దూసుకుంటున్నారు. మాటల తూటాలతో యుద్ధం చేసుకుంటున్నారు. 2024లో కచ్చితంగా పవన్‌ని ముఖ్యమంత్రిగా చూస్తామని ఇన్నాళ్లూ కలలు కన్న జనశ్రేణులు.. అవన్నీ పగటి కలలని తేలడంతో.. ఏం చేయాలో పాలుపోని దిక్కుతోచని స్థితిలోకి వెళ్లిపోయారు. ఒక్కొక్కరుగా.. పార్టీకి ఇన్నాళ్లూ సేవలు చేసినా.. చివరికి బానిసల్లా పవన్ కల్యాణ్ మార్చేశారంటూ ఆవేదనతో జనసేనకు గుడ్‌బై చెబుతున్నట్లు సోషల్ మీడియాలో పోస్టులు చేస్తున్నారు. ఇలాంటి పొత్తులతో ఓట్ షేరింగ్ జరిగే ప్రసక్తే లేదనీ.. రాబోయే ఎన్నికల్లోనూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డే ముఖ్యమంత్రి అవుతారని బల్లగుద్దీ మరీ పోస్టుల్లో చెబుతున్నారు.

వీటిని సహించలేని కొందరు జనసేన పార్టీ నాయకులు.. ఎప్పటిలాగానే.. వ్యతిరేకంగా మాట్లాడుతున్న వారిని కోవర్టులంటూ బూతు పురాణాలు లంఖిస్తున్నారు. దీంతో.. సామాజిక మాధ్యమాల్లో జనసేన కార్యకర్తలు, నాయకులు రెండుగా చీలిపోయారు. కొందరు పవన్ ఏం చేసినా తప్పదు. ఆయన వెంటే నడుస్తామని నైరాశ్యంతో చెబుతుంటే.. సింహభాగం నాయకులు, కార్యకర్తలు మాత్రం.. చంద్రబాబు, లోకేష్‌తో పాటు పవన్‌నీ తిడుతూ.. ఈసారి వైఎస్ జగన్‌కే మా ఓటు.. ఆయనే సీఎం అని బాహాటంగానే తమ నిర్ణయాన్ని వ్యక్తం చేసే వర్గంగా విడిపోయారు.

జనసేనని ఆటాడుకుంటున్న టీడీపీ

మరోవైపు సీట్ల కేటాయింపుతో నిరాశ నిస్పృహలకు లోనైన జనసేన కార్యకర్తలు, నాయకులతో టీడీపీ శ్రేణులు ఆటాడుకుంటున్నాయి. పావలా బతుకులకు 24 సీట్లే ఎక్కువనీ.. ఇచ్చిన సీట్లన్నీ గెలిపించుకోగలరా అంటూ సవాల్ విసురుతున్నారు. మరికొందరు ఒకడుగు ముందుకెళ్లి.. చంద్రబాబు లేదా లోకేష్ సీఎం అవుతారు తప్ప.. పవన్‌కు డిప్యూటీ సీఎం పదవి కూడా ఇచ్చే ప్రసక్తే లేదంటూ ఎద్దేవా చేస్తున్నారు. ఇంకొందరైతే.. ముందు ఎమ్మెల్యేని చెయ్యండి.. తర్వాత సీఎంని చేసే ఆలోచన దగ్గరకు రండి అంటూ రెచ్చగొట్టే ధోరణితో మాట్లాడుతుండటంతో.. జనసేన సోషల్ మీడియా కార్యకర్తలు రగిలిపోతున్నారు. అనవసరంగా చంద్రబాబు జైల్లో ఉన్నప్పుడు మద్దతునిచ్చి పవన్ తప్పు చేశారనీ.. లేదంటే.. అచ్చెన్నాయుడు చెప్పినట్లు ఈ సమయానికి పార్టీ లేదు.. బొ-- లేదు అనే మాటే నిజమై ఉండేదని సమాధానమిస్తున్నారు. ఇలా.. రెండు రోజులుగా ట్విటర్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్‌లో టీడీపీ, జనసేన మధ్య సోషల్ వార్‌నడుస్తోంది.

బుచ్చెయ్యపేటలో టీడీపీ, జనసేన పార్టీలకు షాక్

మల్లాంలో 100 మంది నాయకులు వైఎస్సార్ సీపీలో చేరిక



టీడీపీ, జనసేన పార్టీ నాయకులతో విప్ ధర్మశ్రీ

బుచ్చెయ్యపేట: మండలంలో టీడీపీ, జనసేన పార్టీలకు గట్టి షాక్ తగిలింది. మండల శివారు పంచాయతీ మల్లాం గ్రామంలో టీడీపీ, జనసేన పార్టీ నుంచి వంద మంది నాయకులు, కార్యకర్తలు మూకుమ్మడిగా వైఎస్సార్‌సీపీలో చేరారు. సర్పంచ్ బర్ల శివ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి ఇక్కడ ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ సమక్షంలో వీరంతా తమ కుటుంబ సభ్యులతో కలసి చేరారు. గ్రామానికి చెందిన బొట్టా రాజు, గొలగాని అప్పలనాయుడు, యెరుకోడు, సత్తిబాబు, మురిగితి దేవుడు, మెల్లు సంజీవ్, కలం చిన్ననాయుడు, ఉరికిటి బాపయ్య, మువ్వల దేముడు, తదితరులకు ప్రభుత్వ విప్ ధర్మశ్రీ పార్టీ కండువాలను కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ దొండా రాంబాబు, ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి, వైస్ ఎంపీపీలు దొండా లలితా నారాయణమూర్తి, గొంపా చినబాబు, మండల స్టీరింగ్ కమిటీ అధ్యక్షుడు నమ్మి అప్పలరాజు, మండల సచివాలయ కన్వీనర్ కోరుకొండ అప్పలనాయుడు, డీసీసీబీ మాజీ డైరెక్టర్ కోవెల జనార్దనరావు, సర్పంచులు, ఎంపీటీసీలు, ముఖ్య నాయకులు పినపోలు రామునాయుడు, మరిసా నాని, ముచ్చకర్ల అప్పారావు, ఇందలి కోటేశ్వరరావు, వై గోవింద, గోపిశెట్టి శ్రీను, అమ్మునాయుడు, మేరుగు బాబూరావు, వెంకటపతిరాజు, పుణ్యగిరినాయుడు, పల్లా పోలినాయుడు, సీతా సన్యాసినాయుడు, అప్పాన రాము పాల్గొన్నారు.

జిల్లా స్థాయి ఎడ్ల పోటీల విజేత వల్లంపూడి

దేవరాపల్లిలో ఘనంగా ముగిసిన దేవి తీర్థ మహోత్సవాలు



దేవరాపల్లిలో దౌడు తీస్తున్న ఎడ్లు

దేవరాపల్లి: జిల్లా స్థాయి ఎడ్ల బళ్ల పోటీల్లో విజేతగా వల్లంపూడి సిద్ధి వినాయక ఎడ్లు నిలిచాయి. దేవరాపల్లిలో ఉమామహేశ్వరీ దేవి తీర్థ మహోత్సవాలను పురస్కరించుకొని ఆదివారం నిర్వహించిన ఈ పోటీలు రసవత్తరంగా సాగాయి. ఇందులో జిల్లా వ్యాప్తంగా 21 ఎడ్ల బళ్లు పాల్గొన్నాయి. తర్వాత ద్వితీయ నుంచి తొమ్మిదో స్థానం వరకు వరుసగా పైడితల్లమ్మ(లెక్కలవానిపాలెం), ఆంజనేయ(కేజేపురం), ఏడువాక సత్తిబాబు(వల్లంపూడి), పరవాడ నాయుడు(అర్జునగిరి), జై వీరాంజనేయ(దేవరాపల్లి), ఆంజనేయం(కేజేపురం), గండి వెంకటరావు(వావిలపాడు), ఎతెన్స్ నాయుడు, ఉమామహేశ్వరి(దేవరాపల్లి) ఎడ్లు నిలిచాయి. వీరికి రూ.20 వేలు, రూ.18 వేలు, రూ.16 వేలు, రూ.14 వేలు, రూ.12 వేలు, రూ.10 వేలు, రూ.8 వేలు, రూ.6 వేలు, రూ.4 వేలు, రూ.2 వేల చొప్పున వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కిలపర్తి భాస్కరరావు, కొప్పుల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ డాక్టరు వరదపురెడ్డి సింహాచలంనాయుడు, ఎంపీటీసీ మొల్లి కృష్ణమూర్తి తదితర గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు బహుమతులు ప్రదానం చేశారు. తీర్థ మహోత్సవాన్ని పురస్కరించుకొని ఉమ్మడి విశాఖతోపాటు విజయనగరం జిల్లాల నుంచి వేలాదిగా భక్తజనం తరలి రావడంతో రహదారులన్నీ కిక్కిరిశాయి. ఈ నెల 20వ తేదీ నుంచి ప్రారంభమైన తీర్థ మహోత్సవాలు ఆదివారంతో ముగిశాయి.

విస్తారంగా నువ్వుల పంట

- 15 వేల ఎకరాల్లో సాగు
- రబీలో లాభదాయకం
- ఆరోగ్యంతోపాటు రైతులకు ఆదాయం
- శాస్త్రవేత్తల సూచనలు, సలహాలతో అధిక దిగుబడులు



పూత దశలో నువ్వు పంట



బుచ్చెయ్యపేటలో విస్తారంగా సాగవుతున్న నువ్వు పంట

బుచ్చెయ్యపేట: జిల్లాలో నువ్వుల పంట విస్తారంగా సాగవుతోంది. నూనె గింజల పంటల్లో ప్రధానమైన ఈ సాగుతో స్వల్పకాలంలోనే అధిక లాభాన్ని ఆర్జించవచ్చు. వేసవిలో ఆరుతడి పంటగా వేయడం వల్ల విత్తన నాణ్యతతోపాటు అధిక దిగుబడి వస్తుంది. చీడపీడల సమస్య ఉండదు. ఈ నేపథ్యంలో శాస్త్రవేత్తల సూచనలు, సలహాలు పాటించాలని కొండెంపూడి కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త రాజ్‌కుమార్ తెలిపారు.

ఉమ్మడి విశాఖ జిల్లాలో 15 వేల ఎకరాల వరకు రైతులు నువ్వు సాగు చేపడుతున్నట్లు శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ సిబ్బంది అంచనా వేస్తున్నారు. ప్రధానంగా నువ్వుల్లో 45 నుంచి 55 శాతం వరకు నూనెతోపాటు 25 శాతం ప్రోటీన్లు ఉంటాయి. పలు రకాల యాంటీ ఆక్సిడెంట్లు కలిగి ఉండటం వల్ల ఎక్కువ రోజులు నిల్వ ఉండటమేగాక వ్యాధి నిరోధిక శక్తిని పెంచుతోంది. నువ్వు సాగులో సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చు. నీరు నిలబడని తేలిక నేలలు, బరువు నేలలు నువ్వు సాగుకు అనుకూలంగా ఉంటాయి. నువ్వులు జల్లుకునే ముందు ఎకరాకు 4 టన్నుల పశువుల గెత్తం, 16 కిలోల నత్రజని, 8 కిలోలు పొటాష్ ఎరువులను భూమిలో జల్లుకోవాలి. మెత్తని దుక్కు చేసుకుని నేలను చదును చేసి నువ్వులు జల్లుకుంటే మొక్కలు మొలకెత్తడానికి నీటి తడులు సమానంగా ఇవ్వడానికి అనుకూలంగా ఉంటుంది. నువ్వుల్లో గౌరి, మాధవి, యలమంచిలి-11, యలమంచిలి-17, యలమంచిలి-66 విత్తనాలను రైతులు ఎంపిక చేసుకుని వినియోగించాలి. ఈ రకాలు 75 నుంచి 90 రోజుల్లో పంట కాపు వస్తుంది. ఎకరాకు 400 నుంచి 600 కిలోల వరకు దిగుబడి వస్తుంది. ఎకరాకు 2 నుంచి 4 కిలోలు విత్తనాన్ని ఇసుకతో కలిపి జల్లుకోవాలి. మొక్కల మధ్యన 15 సెంటీమీటర్ల దూరం ఉండేలా చూసుకోవాలి. విత్తనం వేసిన తర్వాత పూత దశలో, కాయ దిగి గింజ కట్టే దశలో నీటి తడులు ఇవ్వాలి. ఆకులు పసుపు రంగులో మారినపుడు, 75 శాతం కాయలు లేత పసుపులోకి వస్తే పంట కోత కోసి కట్టలుగా కట్టుకుని తలకిందులుగా కుప్పలు పెట్టుకోవాలి. 5-6 రోజులు ఎండిన తర్వాత కర్రలతో కొట్టి చేను చేసుకోవాలి. గింజల్లో తేమ శాతం 8కి తగ్గే వరకు ఎండలో ఎండబెట్టి గింజలను జాగ్రత్త చేసుకోవాలి.

తెగుళ్ల నివారణ

- విత్తనాలు జల్లే ముందు కిలో విత్తనానికి 3 గ్రాములు కాప్టాన్, మాంకోజెబ్‌తో విత్తనశుద్ధి చేసి జల్లుకుంటే నేలలో 21 రోజుల వరకు తెగుళ్ల రాకుండా జాగ్రత్త పడొచ్చు.
- నువ్వుల్లో ఎక్కువగా రసం పీల్చే తెగుళ్ల నివారణకు మోనోక్రోటోఫాస్ 3 మిల్లీలీటర్ల మందును లేదా డైమిథోయేట్ 2 మిల్లీలీటర్ల మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.
- వేరు కుళ్లు, కాండం కుళ్లు తెగుళ్ల నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ లేదా మాంకోజెబ్ 3 గ్రాముల మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి.
- గింజలకు పురుగు పట్టకుండా కిలో విత్తనానికి వేప నూనె 25 మిల్లీలీటర్లు, బూడిద 25 గ్రాములు కలిపితే పురుగు పట్టకుండా ఉంటుంది.

నేత్రపర్వంగా ఉపమాక వెంకన్న పెళ్లి రాట

శాస్త్రోక్తంగా నిర్వహించిన అర్చకులు



ఉపమాకలో పెళ్లిరాట వేస్తున్న అర్చకులు

నక్కపల్లి: ప్రముఖ పుణ్యక్షేత్రం ఉపమాక వేంకటేశ్వర స్వామి ఆలయంలో వచ్చే నెల 20వ తేదీ నుంచి ప్రారంభమయ్యే వార్షిక తిరుకల్యాణోత్సవాలకు సంబంధించి పెళ్లిరాట వేసే కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. ఆలయంలో ధ్వజస్తంభ ప్రాంగణంలో ప్రధానార్చకుడు గొట్టుముక్కల వరప్రసాదాచార్యులు ఆధ్వర్యంలో అర్చక స్వాములు సంకర్షణ పల్లి కృష్ణమాచార్యులు, పీసపాటి వెంకట శేషాచార్యులు ఈ కార్యక్రమాన్ని వైదిక సంప్రదాయబద్ధంగా శాస్త్రోక్తంగా నిర్వహించారు. వచ్చే నెల 20వ తేదీ నుంచి ఐదు రోజులపాటు స్వామివారి వార్షిక కల్యాణోత్సవాలు అంగరంగ వైభవంగా జరగనున్నాయి. ఉత్సవాలకు సంబంధించిన అంకురార్పణ 19న జరగనుంది. భాగవతం రాజగోపాలాచార్యులు, దేవస్థానం ఇన్‌స్పెక్టర్ వెంకట కూర్వేశ్వరరావు, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కొప్పిశెట్టి కొండబాబు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి పాడగట్ల పాపారావు, వైఎస్సార్ సీపీ స్టూడెంట్ విభాగం అధ్యక్షుడు కొప్పిశెట్టి హరిబాబు, శ్రీపాద ప్రణవ్, సర్పంచ్ ప్రగడ వీరబాబు, పెంకులరాజు, ఆకేటి గోవిందరావు పాల్గొన్నారు.

సమన్వయం సాధిస్తా..

తుమ్మపాల: శాసనసభ ద్వారా రాష్ట్రానికి సేవలు అందించాలనే ఉద్దేశంతోనే జనసేన, టీడీపీ ఉమ్మడి అభ్యర్థిగా అనకాపల్లి బరిలో నిలుస్తున్నట్టు జనసేన నాయకుడు కొణతాల రామకృష్ణ చెప్పారు. ఉత్తరాంధ్ర ఇలవేల్పు నూకాంబిక అమ్మవారిని ఆదివారం ఆయన దర్శించుకున్నారు. స్థానిక విలేకరులతో మాట్లాడుతూ టీడీపీ, జనసేన నాయకులను కలిసి సహకారం కోరతానన్నారు. సమన్వయంతో ఎన్నికల్లో పాల్గొంటామన్నారు.

డీఈవో ఆకస్మిక తనిఖీ

టెన్త్ విద్యార్థుల ప్రత్యేక తరగతుల పరిశీలన



లంకెలపాలెంలో శిక్షణ తరగతులను పరిశీలించి మాట్లాడుతున్న డీఈవో వెంకటలక్ష్మమ్మ

అగనంపూడి: పదో తరగతి పరీక్షల్లో శత శాతం ఉత్తీర్ణత సాధించేందుకు ప్రణాళికాబద్ధంగా చదవాలని అనకాపల్లి డీఈవో వెంకటలక్ష్మమ్మ విద్యార్థులకు సూచించారు. లంకెలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న పదో తరగతి ప్రత్యేక శిక్షణ తరగతులను ఆదివారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ముచ్చటించారు. సబ్జెక్టుకు సంబంధించి ఏమైనా సందేహాలుంటే నివృత్తి చేసుకోవాలని సూచించారు. ప్రత్యేక తరగతులను సద్వినియోగం చేసుకుని ప్రతీ విద్యార్థి మంచి మార్కులు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో విద్యాశాఖ కార్యాలయ అధికారి వెంకటేశ్వరరావు, పాఠశాల హెచ్ఎం రౌతు నాగేశ్వరరావు, ఆంగ్ల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ గురుకుల విద్యార్థి మృతి



ప్రవీణ్‌కుమార్ (ఫైల్)

కొయ్యూరు: అనారోగ్యంతో బాధపడుతున్న గురుకుల పాఠశాల విద్యార్థి చికిత్స పొందుతూ మృతి చెందాడు. అత్యవసర వైద్యం అందించి ప్రాణాలు కాపాడేందుకు పాఠశాల ప్రిన్సిపాల్ నుంచి ఐటీడీఏ పీవో వరకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. గొలుగొండ మండలం చంద్రయ్యపాలెంకు చెందిన గోరా ప్రవీణ్‌కుమార్ (15) స్థానిక గురుకులంలో టెన్త్ చదువుతున్నాడు. అనారోగ్యానికి గురైన అతనిని ఈనెల 17న కేజీహెచ్‌కు తరలించారు. ఐటీడీఏ పీవో అభిషేక్ ఆదేశాల మేరకు అక్కడ ట్రైబల్ సెల్ ఆధ్వర్యంలో పర్యవేక్షిస్తూ చికిత్స అందించారు. అతని ఊపిరితిత్తులు, మూత్రాపిండాలు, కాలేయం పాడవడం వల్ల శనివారం రాత్రి ఆరోగ్య పరిస్థితి విషమించింది. అత్యవసర వైద్యం అందించినా ఫలితం లేకపోయింది. అర్ధరాత్రి దాటాక మృతి చెందాడు. అతని మరణ వార్తతో స్థానిక పాఠశాలలో, విద్యార్థి స్వగ్రామమైన చంద్రయ్యపాలెంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతదేహాన్ని ఆదివారం ఉదయం స్వగ్రామానికి తీసుకువచ్చారు.

క్లుప్తంగా

నూకాంబిక అమ్మవారికి ప్రత్యేక పూజలు



కశింకోటలో నూకాంబిక అమ్మవారికి పూజలు

కశింకోట : స్థానిక నూకాంబిక అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కళకళలాడింది. వారపు పొద్దు కావడంతో భక్తులు ఎక్కువ మంది దర్శించారు. చీరలు, రవికెలు, తల నీలాలు, అరటి గెలల రూపంలో అమ్మవారికి మొక్కుబడులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని అందంగా పూలమాలలు నూతన వస్త్రాలతో అలంకరించి కుంకుమార్చనలు నిర్వహించారు. కొందరు తమ ఇళ్ల వద్ద రాత్రి అంతా నూకాంబిక జాగరణ నిర్వహించుకొని బంధువులు, కుటుంబ సభ్యులతో ఊరేగింపుగా అరటి గెలలు, బోనాలతో ఆలయానికి వచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం ప్రాంగణంలో అన్న సమారాధనలు జరిపారు.

'నకిలీ గృహ పట్టాలపై విచారణ జరపాలి'

అనకాపల్లి : అచ్చియ్యపేట గ్రామం సమీపంలో సంపతిపురం లేఅవుట్ 2/2లో జరుగుతున్న 303 గృహ నిర్మాణాలపై ప్రభుత్వం సమగ్ర విచారణ చేపట్టాలని సీపీఐ అనకాపల్లి జోనల్ కార్యదర్శి వై.ఎస్.భద్రం, మండల కార్యదర్శి నాగరాజు డిమాండ్ చేశారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జగనన్న గృహాల్లో అర్హులైన లబ్ధిదారుల పట్టాలను సమగ్రంగా విచారణ జరిపించాలని, అవినీతికి పాల్పడిన వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. నకిలీ పట్టాలను తయారు చేసి అమ్మడం ద్వారా కోట్లాది రూపాయలు చేతులు మారుతున్నాయన్నారు.

నూకాంబిక ఆలయంలో అష్టలక్ష్మి విగ్రహాలు



కశింకోటలోని నూకాంబిక ఆలయంలో కొలువైన అష్ట లక్ష్మీ విగ్రహాలు

కశింకోట : కశింకోటలోని నూకాంబిక అమ్మవారి ఆలయం ప్రాంగణంలో అష్టలక్ష్మి విగ్రహాలను నూతనంగా నెలకొల్పారు. ఇవి ఆహూతులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. లక్ష్మీదేవి అష్ట అవతారాలతో ఉన్న ధనలక్ష్మి, ధాన్య లక్ష్మి, ధైర్యలక్ష్మి, విజయలక్ష్మి, వరలక్ష్మి తదితర విగ్రహాలను వరుసగా నెలకొల్పి అందంగా రంగులు వేశారు. ఇవి చూడముచ్చటగా ఉన్నాయి. వీటిని ఆలయానికి వచ్చే భక్తులు ఆసక్తిగా తిలకిస్తూ భక్తి పారవశ్యం చెందుతున్నారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త వేగి శివ గణేష్ ఆధ్వర్యంలో వీటిని ఏర్పాటు చేశారు.

అనకాపల్లి సినిమాలు

ఈగల్	: రాజా
సుందరం మాస్టర్:	సత్యనారాయణస్క్రీన్-1
భ్రమయుగం :	సత్యనారాయణ స్క్రీన్-2
సిద్ధార్థరాయ్	: షిర్డిసాయి
ఊరు పేరు భైరవకోన	: పర్తిసాయి
వూడో తిరిగి వచ్చింది:	వెంకటేశ్వర
నా సామిరంగ	: శ్రీసత్య
హనుమాన్	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 61 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-17 యూనిట్లు, బీ పాజిటివ్-28 యూనిట్లు, ఓ పాజిటివ్-14 యూనిట్లు, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నిషన్ యు.లోకేష్ (9703619706) నంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా ఆదివారం 228 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 201 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.



అభివృద్ధికి చిరునామాగా జెట్టపురెడ్డి తుని

- సచివాలయ పరిధిలో **రూ.1.80 కోట్లతో** అభివృద్ధి
- రూపుమారిన పాఠశాలలు
- పశువైద్య కేంద్రానికి సొంత భవనం
- మురుగుకాలువలు, సీసీ రోడ్ల నిర్మాణం



నిర్మాణం పూర్తయిన సంపద కేంద్రం

- జెట్టపురెడ్డితుని సచివాలయ భవనం నిర్మాణం : రూ.**25** లక్షలు
- నాడు-నేడు రెండు విడతల్లో నరసింగబిల్లి హైస్కూలు అభివృద్ధికి ఖర్చు : రూ.**97** లక్షలు
- నాడు-నేడులో నరసింగబిల్లి, జెట్టపురెడ్డితుని ప్రాథమిక పాఠశాలల అభివృద్ధి ఖర్చు చెరో రూ.**18** లక్షలు
- సంపద కేంద్రం నిర్మాణం రూ.**6** లక్షలు
- గ్రామీణ పశు వైద్య కేంద్ర భవన నిర్మాణం రూ.**6** లక్షలు
- మురికి కాలువలు నిర్మాణం రూ.**10** లక్షలు
- సిమెంట్ రోడ్ల నిర్మాణం రూ.**2** లక్షలు

కశింకోట : మండలంలోని జెట్టపురెడ్డితుని సచివాలయం పరిధిలో గ్రామీణ అభివృద్ధికి చిరునామాగా మారింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో సుమారు రూ.కోటి 82 లక్షలతో గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి పనులు జరిగాయి. దశాబ్ద కాలంగా అసంపూర్తిగా ఉన్న పశు వైద్య కేంద్ర భవనాన్ని పూర్తి చేయగా ప్రారంభానికి సిద్ధంగా ఉంది. నాడు-నేడులో మూడు పాఠశాలల్లో పూర్తి వసతులు సమకూర్చారు. సుమారు 3 వేల జనాభా కలిగిన జెట్టపురెడ్డితునితో పాటు శివారు నరసింగబిల్లి జంట గ్రామాలుగా పక్కనే కలిసి ఉన్నాయి. జాతీయ రహదారిని ఆనుకొని ఉన్నాయి. ఇక్కడ పంచాయతీ కార్యాలయంపైన రూ.25 లక్షలతో సచివాలయ భవనాన్ని నిర్మించారు. నరసింగబిల్లి జిల్లా పరిషత్ హైస్కూల్లో సుమారు 450 మంది విద్యార్థులు చదువుతుండగా, నాడు-నేడులో తొలి విడతలో రూ.61 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టారు. పాఠశాలకు అందంగా రంగులు వేసి, ఫర్నిచర్ సమకూర్చారు. బాల బాలికలకు వేర్వేరుగా మరుగుదొడ్లను నిర్మించారు. తాగునీరు, చేతులు శుభ్రపరచుకోవడానికి కుళాయిలను ఏర్పాటు చేశారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి పచ్చదనం పెంపొందించారు. రెండో విడత నాడు-నేడులో రూ.36 లక్షలు వెచ్చించి తరగతి గదులను నిర్మించారు.



నాడు-నేడులో నరసింగబిల్లి హైస్కూల్లో అందంగా మొక్కలు వేసి తీర్చిదిద్దిన చిత్రం

పశు వైద్య కేంద్ర భవనానికి మోక్షం

నరసింగబిల్లి పశు వైద్య కేంద్ర భవనానికి దశాబ్దం తర్వాత మోక్షం లభించింది. ఈ భవనం నిధుల లేమితో దాదాపు దశాబ్ద కాలంగా అసంపూర్తిగా ఉంది. కొంత కాలం పాత శిథిల భవనంలోను, మరికొంత కాలం సామాజిక భవనంలోను వైద్య సేవలందించేవారు. ఈ నేపథ్యంలో రూ.6 లక్షలు వెచ్చించి అసంపూర్తిగా ఉన్న పశు వైద్య కేంద్ర భవనాన్ని పూర్తి చేశారు. త్వరలోనే ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్నారు. అలాగే రూ. 6 లక్షలతో నిర్మించిన సంపద కేంద్రం ప్రారంభానికి సిద్ధంగా ఉంది. హైస్కూలు వెనుక ప్రాంతంలో గడప గడపకు మన ప్రభుత్వం నిధుల నుంచి రూ.10 లక్షలు వెచ్చించి మురుగుకాలువలు నిర్మించారు. రజక వీధిలో గతంలో ఏ మాత్రం వర్షం వచ్చినా అడుగు పెట్టలేని పరిస్థితి ఉండేది. ఇపుడు రూ. లక్ష వెచ్చించి సిమెంట్ రోడ్డు నిర్మించారు.



రజక కాలనీలో నిర్మించిన సిమెంట్ రోడ్డు



నాడు-నేడులో అభివృద్ధి చేసిన నరసింగబిల్లి హైస్కూలు

రహదారి కష్టాలు తీరాయి



రజక కాలనీ రోడ్డులో ఏ మాత్రం వర్షం వచ్చినా అడుగు పెట్టలేని పరిస్థితి ఉండేది. ఈ నేపథ్యంలో తాజాగా సిమెంట్ రోడ్డు నిర్మించారు. దీంతో రోడ్డు బాగు పడింది. ఎంతో ఆనందంగా ఉంది.

–చలపాక వరలక్ష్మి, రజక కాలనీ, జెట్టపురెడ్డితుని.

సకాలంలో ప్రభుత్వ సేవలు



సచివాలయాలు ఏర్పాటు చేసినప్పటి నుంచి ప్రభుత్వ సేవలు స్థానికంగానే అందిస్తున్నారు. కశింకోట మండల కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం తప్పింది. ఇబ్బందులు తొలిగాయి. ఎంతో ఆనందంగా ఉంది. ఇటువంటి వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రజలకు సేవలందిస్తున్నందుకు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు.

–మాపూరి వరలక్ష్మి, నరసింగబిల్లి

పార్టీ గెలుపు కోసం ప్రతి వ్యక్తి సహకరించాలి



స్విమ్మింగ్ చేస్తున్న వ్యక్తులతో మాట్లాడుతున్న మలసాల భరత్‌కుమార్

అనకాపల్లి : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపుకోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తామని పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ అన్నారు. శంకరం పంచాయతీ పరిధిలో అనకాపల్లి స్విమ్మింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్విమ్మింగ్ సభ్యులతో కలిసి స్విమ్మింగ్ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి గురించి వివరించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, ఎన్టీఆర్ ఆస్పత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ జి.రామ్మూర్తి, పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు-1 ఉగ్గిన అప్పారావు పాల్గొన్నారు.

వచ్చే నెల 17న భద్రావతీ సమేత భావనారాయణస్వామి కల్యాణం



భద్రావతి సమేత భావనారాయణస్వామి కల్యాణ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ దివ్యతేజ

అనకాపల్లి : స్థానిక వేల్పులవీధి శ్రీ కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయ ఆవరణలో మార్చి 17న శ్రీ భద్రావతి సమేత శ్రీ భావన్నారాయణ స్వామి కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు అనకాపల్లి పద్మశాలీ సంక్షేమ సంఘం ప్రతినిధి డాక్టర్ దివ్యతేజ అన్నారు. స్థానిక వివేకానంద నగర్ దివ్యతేజ ఆస్పత్రి ఆవరణలో ఆదివారం అమ్మవారి కల్యాణ పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విశాఖ ఉమ్మడి జిల్లాల నుంచి వేలాది మంది పద్మశాలీలు ఈ కల్యాణోత్సవంలో పాల్గొంటారని ఆయన చెప్పారు. అదే రోజు మధ్యాహ్నం భారీ అన్న సమారాధన నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర పద్మశాలీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పప్పు రాజారావు, అనకాపల్లి సంఘం అధ్యక్షుడు పంపాన సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి దొడ్డి ఈశ్వరరావు, కోశాధికారి తిప్పన అప్పారావు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ మహిళా నేతలకు సత్కారం



వరుదు కల్యాణిని సత్కరిస్తున్న జిల్లా మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు పెంటకోట జ్యోతి

కశింకోట : వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా విభాగం ఉపాధ్యక్షురాలిగా నియమితులైన కశింకోట వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతిని మహిళా విభాగం నేతలు అభినందించారు. కె.కోటపాడులో ఆదివారం నిర్వహించిన సమావేశంలో పార్టీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు వరుదు కల్యాణి, జిల్లా అధ్యక్షురాలు అనురాధ ఆమెకు దుశ్శాలువా కప్పి అభినందించారు. మహిళా విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులైన మార్కెట్ కమిటీ డైరెక్టర్ సీటీపల్లి లక్ష్మిని కూడా అభినందించారు. ఈ సందర్భంగా జ్యోతి, లక్ష్మి తదితరులు కల్యాణి, అనూరాధలను దుశ్శాలువాలు కప్పి సత్కరించారు. తమకు ఈ పదవులు రావడానికి కారకులైన ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

రూ.48 లక్షలతో వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ పునర్నిర్మాణం

- అవసరమైతే మరిన్ని నిధులు తీసుకువస్తా
- నర్సీపట్నం ఎమ్మెల్యే గణేష్



నిధులు మంజూరు పత్రాన్ని సంఘ ప్రతినిధులకు అందజేస్తున్న ఎమ్మెల్యే గణేష్

నర్సీపట్నం: పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ పునర్నిర్మాణానికి ప్రభుత్వం రూ.48 లక్షలు మంజూరు చేసిందని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ పేర్కొన్నారు. వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో విశ్వబ్రాహ్మణ సంఘం ప్రతినిధులతో ఆదివారం ఆయన సమావేశమయ్యారు. ఆలయ పునర్నిర్మాణ విషయాన్ని సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి దృష్టిలో పెట్టగా, శనివారం రూ.48 లక్షలు మంజూరు చేస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసిందన్నారు. త్వరితగతిన పనులు మొదలు పెట్టేందుకు అవసరమైన ప్రక్రియను పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. మాట ఇచ్చానంటే తప్పనిసరిగా చేస్తానన్నారు. ఒకే ఒకసారి తన దృష్టికి తీసుకొచ్చారని, అందరిలా మాటలు చెప్పే వ్యక్తిని కాదని, పని చేసి చూపించడమే తననైజం అన్నారు. నిధులు సరిపోకపోతే మరిన్నీ తీసుకువస్తానని సంఘం ప్రతినిధులకు హామీ ఇచ్చారు. అనంతరం నిధులు మంజూరు పత్రాన్ని సంఘ ప్రతినిధులు పెదపాటి గోవిందరావు, నాగేశ్వరరావులకు అందజేశారు. కొన్నేళ్లుగా అభివృద్ధికి నోచుకోని ఆలయానికి ఎమ్మెల్యే గణేష్ చొరవతో పూర్వ వైభవం రానుందని సంఘ ప్రతినిధి గోవిందరావు పేర్కొన్నారు. అనంతరం ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. ముందుగా వీరబ్రహ్మేంద్రస్వామి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు కోనేటి రామకృష్ణ, తమరాన అప్పలనాయుడు, పార్టీ టౌన్ అధ్యక్షుడు ఏకా శివ, నూకాలమ్మ దేవాలయం చైర్మన్ ధనిమిరెడ్డి నాగు, మున్సిపాలిటీ యూత్ అధ్యక్షుడు ధనిమిరెడ్డి ప్రసాద్, పార్టీ నాయకులు బేతిరెడ్డి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

స్వయంభూ వరాహలక్ష్మీ నృసింహస్వామికి పూజలు



స్వామివారిని దర్శించుకుంటున్న రమణమ్మ, తదితరులు

చీడికాడ: అర్జునగిరిలో వెలసిన స్వయంభూ శ్రీదేవి, భూదేవి సమేత వరాహలక్ష్మీ నృసింహస్వామి వారిని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు సతీమణి రమణమ్మ ఆదివారం మధ్యాహ్నం దర్శించుకున్నారు. ఇక్కడ స్వామివారి కల్యాణోత్సవాల్లో భాగంగా అన్నసమారాధన కార్యక్రమానికి తమ వంతు సహకారంగా సర్పంచ్ బి.రమాదేవి, పెద్దలకు రూ.5 వేలు అందజేశారు.

27న నల్లమారమ్మతల్లి ఉత్సవం

అనకాపల్లి : మండలంలో బీఆర్టీ కాలనీలో ఈనెల 27న శ్రీ నల్లమారమ్మ తల్లి అమ్మవారి ఉత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు ఉత్సవ కమిటీ చైర్మన్ దాడి కుమార్ రాజా అన్నారు. స్థానిక ఆలయ ఆవరణలో అమ్మవారి ఉత్సవ పోస్టర్‌ను ఆదివారం కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారుగా 30 ఏళ్లుగా అమ్మవారి ఉత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. అదేరోజు అమ్మవారికి తెల్లవారు జామునుంచి కుంకుమ పూజలు నిర్వహించడం, సాంస్కృతిక కార్యక్రమాలు, స్టేజ్ ప్రోగ్రాంలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పెదిశెట్టి రమేష్, కాండ్రేగుల కిరణ్, రత్నాల ప్రకాష్ పాల్గొన్నారు.

శాంతిపార్కులో సందడే సందడి



శాంతిపార్కులో చిన్నారులు, పెద్దలు

అనకాపల్లి : స్థానిక శారదానది ఒడ్డున శాంతిపార్కుల చిన్నారులతో ఆదివారం కళాకళాలాడింది. రెండు రోజుల క్రితం రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పార్కును ప్రారంభించారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని పార్కును అభివృద్ధి చేయాలని జీవీఎంసీ రూ.49 లక్షలు, ఎంపీ నిధులు రూ.10 లక్షల నిధులతో అభివృద్ధి చేసిన విషయం తెలిసిందే. 82వ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత ఆధ్వర్యంలో పార్కును అభివృద్ధి చేయడంతో పట్టణ పరిధిలో చిన్నారులు, వృద్ధులు, యువకులు పార్కును చూసి ఎంతగానో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

అక్రమ మద్యం కేసులో ఒకరి అరెస్టు

కశింకోట : కన్నూరుపాలెంలో మద్యం సీసాలు తరలిస్తుండగా ఆదివారం ఓ వ్యక్తిని పట్టుకున్నట్టు ఎస్‌ఐ ఎం.రమేష్‌బాబు తెలిపారు. 11 క్వార్టర్ మద్యం సీసాలు స్వాధీనం చేసుకొని నిందితుడు వెంకునాయుడును అరెస్టు చేశామన్నారు.

గుల్లేపల్లిలో గడ్డివాము దగ్ధం

కె.కోటపాడు: గుల్లేపల్లిలో గడ్డివాము అగ్నికి ఆహుతైంది. ఆదివారం ఇక్కడ రైతు బి.తాతయ్యకు చెందిన గడ్డివాముకు మంటలంటుకుని కాలిపోయింది. తొలుత రైతులు మంటలను అదుపు చేసేందుకు యత్నించినా ఫలితం లేకపోవడంతో చోడవరం అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వారొచ్చి మంటలను అదుపు చేశారు. రూ.20 వేల నష్టం వాటిల్లినట్టు అంచనా వేశారు.

చురుగ్గా రామాలయ నిర్మాణం



నిర్మాణ దశలో రామాలయం

గొలుగొండ: నాగాపురంలో రామాలయ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఆలయ నిర్మాణం కోసం టీటీడీ నుంచి రూ.10 లక్షలు మంజూరు కావడంతో సర్పంచ్ యలమంచిలి రఘురాం ఆధ్వర్యంలో పనులు చేస్తున్నారు. దీనికితోడు గ్రామస్తులు సైతం సహాయ సహకారాలు అందించడంతో త్వరితగతిన పూర్తి చేస్తామని ఆయన తెలిపారు. ఆలయ నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయించిన నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్‌కు గ్రామస్తుల తరఫున కృతజ్ఞతలు తెలిపారు.

జార్జి క్లబ్ అధ్యక్షునిగా జోగినాయుడు



జార్జిక్లబ్ నూతన కమిటీ ప్రమాణస్వీకారం

అనకాపల్లి : స్థానిక జార్జిక్లబ్ ఆవరణలో ఆదివారం నూతన పాలక వర్గ కమిటీ సభ్యులను క్లబ్ సీనియర్ సభ్యుడు, విశ్రాంతి డీఈవో కె.వి.గౌరీపతి ప్రమాణ స్వీకారం చేయించారు. క్లబ్ అధ్యక్షునిగా బి.ఎస్.ఎం.కె.జోగినాయుడు, కార్యదర్శిగా బుద్ధ కాశీ విశ్వేశ్వరరావు, కోశాధికారిగా వి.చంద్రశేఖర్, ఉపాధ్యక్షునిగా కె.వి.ఎం.వెంకటరావు, సహాయ కార్యదర్శిగా కె.శ్రీనివాసరావుతో పాటు మరో ఆరుగురు పాలక వర్గ సభ్యులు ప్రమాణాస్వీకారం చేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు బి.ఎస్.ఎం.కె.జోగినాయుడు మాట్లాడుతూ నూతన పాలకవర్గ పై కమిటీ రెండు సంవత్సరాలు ఉంటుందన్నారు. క్లబ్ అభివృద్ధికి శక్తివంచన లేకుండా క్లబ్ సభ్యుల సహకారంలో కృషి చేస్తామని ఆయన పేర్కొన్నారు.

పుస్తక పఠనంపై ఆసక్తి పెరగాలి



తాళ్లపాలెం గ్రంథాలయంలో పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

కశింకోట : విద్యార్థులు విద్యతో పాటు పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలని గ్రంథాలయ అధికారి కె.జగన్నాథం కోరారు. తాళ్లపాలెం శాఖ గ్రంథాలయంలో ఆదివారం «చదవడం మాకిష్టం» కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులతో పుస్తక పఠనం చేయించారు. విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ ఆదివారం పాఠశాలలకు సెలవు కావడం అయినందున ఆరోజు గ్రంథాలయంలో పుస్తక పఠనం చేయడం పట్ల శ్రద్ధ వహించాలన్నారు. గ్రంథాలయంలో అనేక విజ్ఞానదాయకమైన పుస్తకాలు, పత్రికలు, గ్రంథాలు, జీవిత చరిత్రలు అందుబాటులో ఉన్నాయని, వాటిని చదువుకొని విజ్ఞానవంతులు కావాలని కోరారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



కామేశ్వరమ్మ ఆలయం వద్ద కలుసుకున్న పూర్వ విద్యార్థులు



కింతలి హైస్కూల్‌లో ఒక చోట చేరిన పూర్వ విద్యార్థులు

మాకవరపాలెం: పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక ఉల్లాసంగా సాగింది. స్థానిక ఉన్నత పాఠశాలలో 1994–95 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులంతా రాచపల్లి జంక్షన్‌లో కామేశ్వరమ్మ ఆలయం వద్ద ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారంతా చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆనందంగా గడిపారు. ఒకరికొకరు యోగక్షేమాలతోపాటు ప్రస్తుతం వారు స్థిరపడిన రంగాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో 50 మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

కింతలి హైస్కూలులో...

మాడుగుల: కింతలి జెడ్పీ హైస్కూల్‌లో 1989–90 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులంతా సందడి చేశారు. తాము చదువుకున్న స్కూల్‌లోనే ఆదివారం ఆత్మీయంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా చిన్ననాటి చిలిపి చేష్టలు గుర్తుకు తెచ్చుకుని మురిసిపోయారు. ఇదే పాఠశాలలో చదువుకుని ఉపాధ్యాయ వృత్తి చేపట్టిన తోటి మిత్రులను ఏరా ఎలా ఉన్నావ్.. వరే అంటూ ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఎవరెవరు ఏయే వృత్తుల్లో స్థిరపడ్డారో తెలుసుకుని ఆనందించారు. అనంతరం తమకు చదువు నేర్పిన ఉపాధ్యాయులు చినబాబు, రామకృష్ణలకు దుశ్శాలువా కప్పి ఘనంగా సత్కరించి గౌరవించారు.